క్లుప్తంగా

గ్రామదేవత కడియాలమ్మ గ్రామోత్సవం



దేవరపల్లి గ్రామ దేవత కడియాలమ్మతల్లిని ఊరేగిస్తున్న భక్తులు

దేవరపల్లి: దేవరపల్లి గ్రామ దేవత కడియాలమ్మ అమ్మవారిని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ఘనంగా ఊరేగించారు. ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా కనుమ రోజున అమ్మవారికి పూజలు నిర్వహించి, భక్తులు నైవేద్యాలు సమర్పిస్తారు. మొక్కుబడులు తీర్చుకుంటారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమ్మవారిని గ్రామంలో ఇంటింటికీ తీసుకువెళ్లి పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమ, చలివిడి పానకాలు సమర్పించారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ వీరకుమారి, ఉప సర్పంచ్ సాంబశివరావు

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా దేవరపల్లి పంచాయతీలో కార్మికులు, సిబ్బందికి మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ కడిమి వీరకుమారి, వైస్ సర్పంచ్ వెలగా సాంబశివరావు, వార్డు సభ్యుల చేతల మీదుగా దుస్తులు అందజేశారు. 46 మంది కార్మికులకు దుస్తులు అందజేసినట్టు సర్పంచ్ వీరకుమారి తెలిపారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కడిమి రాజు తదితరులు పాల్గొన్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో..



దూబచర్ల జెడ్పీ హైస్కూల్లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

నల్లజర్ల: ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాం అంటూ పూర్వ విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. నల్లజర్ల మండలం దూబచర్ల జెడ్పీ హైస్కూల్లో చదువుకున్న 1999–2000 పదో తరగతి విద్యార్థులు బుధవారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. 25 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి, ఆనాటి గుర్తులను నెమరువేసుకుంటూ ఆనందంతో మురిసిపోయారు. తమకు చదువు చెప్పిన గురువులు బీజే శర్మ, నాగేశ్వరరావు, నాగార్జున, ఝాన్సీరాణిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు రాజశేఖర్, శివరాజు, రాజ్‌కుమార్, జామి నాగేశ్వరరావు, పాతూరి హరికృష్ణ, బ్రాహ్మణపల్లి లావణ్య, సుంకవల్లి లీలా నాగమణి, నాదెళ్ల స్వప్న, వేగి సుచంద్ర తదితరులు హాజరయ్యారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

ఉండ్రాజవరం: మండలంలోని కె.సావరం గ్రామంలో ముత్యాలమ్మ జాతర మహోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా అమ్మవారికి ఊయల సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ప్రతి ఇంటి నుంచి జ్యోతులతో ఊరేగింపుగా గుడి వద్దకు నైవేద్యం తెచ్చారు.

కోడి పందేలు ఆడుతున్న 14 మంది అరెస్టు

ఉండ్రాజవరం: మండలంలో కోడి పందేలు, జూదాలు ఆడుతున్న వారిపై బుధవారం ఉండ్రాజవరం ఎస్సై గుబ్బల శ్రీనివాస్, సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడిలో 5 కేసులు నమోదు చేసి 14 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీనివాసు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,550 నగదు, 4 కత్తులు, 4 కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నిత్యావసరాల అందజేత

ఉండ్రాజవరం: మండలంలోని సూర్యారావుపాలెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితులకు మంత్రి కందుల దుర్గేష్ తరుపున రూ.10 వేల నగదును బుధవారం గ్రామ సర్పంచ్ లలిత కుమారి చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వం తరుపున నిత్యావసర వస్తువులను తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ బాధితులకు అందించారు.

యువత క్రీడల్లో రాణించాలి

కొవ్వూరు: యువత చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దుద్దుపూడి రాజా రమేష్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ క్రీడా ప్రాంగణంలో సన్ రైజర్స్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. టోర్నమెంట్‌లో కొవ్వూరు జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు.

మెట్టలో కోడిపందేల జోరు

- మూడు రోజులు కోలాహలంగా పందేలు
- పందేల వద్ద యథేచ్ఛగా జూదక్రీడలు
- బహిరంగంగా గుండాటలు
- చేతులు మారుతున్న నగదు

దేవరపల్లి: సంక్రాంతి పండగను ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. సంక్రాంతి అంటే జిల్లాలో కోడిపందేలు గుర్తుకువస్తాయి. డెల్టాకు దీటుగా మెట్ట ప్రాంతంలో కోడిపందేలు నిర్వహించారు. ఈ ఏడాది అర్ధరాత్రి 2 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పలు గ్రామాల్లో కోడిపందేలను నిర్వహించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ పండుగ మూడు రోజులు గ్రామాల్లో కోడిపందేలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది సంక్రాంతి పండగను కోడిపందేలతో ప్రజలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకొన్నారు. బుధవారం సాయంత్రం నియోజకవర్గంలో కోడిపందేలు ముగిశాయి. గ్రామాల్లో కోడిపందేల బరులు ఏర్పాటు చేసి పందెం రాయుళ్లు అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. పందాల వద్ద గుండాట బోర్డులు ఏర్పాటు చేశారు. ఒక్కో బరి వద్ద 5 నుంచి 10 బోర్డులు ఏర్పాటు చేసి గుండాట నిర్వహించారు. యువత ఎక్కువగా అటు వైపు మక్కువ చూపారు. గతంలో పోల్చితే కోడి పందేల సందడి పెరిగింది. ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో పందేలు నిర్వహించారు. పోలీసుల హెచ్చరికలను ఖాతరు చేయకుండా మెట్ట ప్రాంతంలోని పలు గ్రామాల్లో కోడిపందేలను యథేచ్ఛగా నిర్వహించారు. పలు గ్రామాల్లో మహిళలు కోడిపందేలను తిలకించారు. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, కర్నాటక, ఇతర దేశాల నుంచి స్వగ్రామలకు వచ్చిన బంధువులు కోడిపందేలను ఆసక్తిగా తిలకించి ఆనందం పొందారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో చిన్న, పెద్ద బరులు



దేవరపల్లి-యాదవోలు రోడ్డులో దేవరపల్లి వద్ద నిర్వహిస్తున్న కోడిపందేలు

సుమారు 50 బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు నిర్వహించారు. ఒక్కో పందెం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నిర్వహించారు. ఈ ఏడాది బరుల సంఖ్య పెరిగింది. బరుల నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడంతో చిన్న బరుల వద్ద ఖర్చులు తప్ప మిగులు ఉండడం లేదని పలువురు నిర్వాహకులు తెలిపారు. దేవరపల్లి మండలంలో దేవరపల్లి, బందపురం, త్యాజంపూడి, యర్నగూడెం, యాదవోలు, చిన్నాయగూడెం, గౌరీపట్నం, దుద్దుకూరు, పల్లంట్ల గ్రామాల్లో కోడిపందేల బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. ఎక్కువగా జోడి పందేలు నిర్వహించారు. మూడు రోజులు రూ.కోట్లలో చేతులు మారాయి. కోడిపందేలను తిలకించేందుకు బరుల వద్ద గ్యాలరీలు ఏర్పాటు చేశారు.



దేవరపల్లి మండలం యర్నగూడెంలో కోడిపందాల వద్ద ఏర్పాటు చేసిన గుండాట

కోసలకు గిరాకీ

పందెంలో ఓటమి చెందిన (చనిపోయిన) కోసలకు డిమాండ్ పెరిగింది. ఒక్కో కోస మాంసం ప్రియులు కోసల కోసం ఎగబడ్డారు. కోస ఖరీదు రూ.4 వేల నుంచి 5 వేలు పలికింది. అయినా మాంసం ప్రియులు పోటీపడి కొనుగోలు చేశారు. కోసలను కొనుగోలు చేసి బంధువులకు పంపించారు.

విచ్చలవిడిగా కోడి పందేలు, జూదాలు

గోపాలపురం: మూడు రోజులుగా మండలంలోని అనేక గ్రామాలలో కోడి పందేలు, గుండాట, పేకాట, మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. పోలీసులు పట్టించుకోకపోవడంతో జూదగాళ్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కోడి పందేలలో నిర్వాహకులు పేకాట, మద్యం, గుండాట వంటివి ఏర్పాటు చేశారు. ఒక్కొక్క బరిలో రూ.10 లక్షల నుండి రూ.50 లక్షల వరకు చేతులు మారినట్లు సమాచారం.

కోజాలకు పెరిగిన డిమాండ్

సంక్రాంతి సందర్భంగా కొత్త అల్లుళ్లు ఇంటికి చేరడంతో కోడి పందేల్లో ఓడిన కోడి (కోజా) పుంజులకు మరింత డిమాండ్ పెరిగింది. ఒక కోజా రూ.6 వేల నుండి రూ.15 వేలకు పలికింది. మండలంలోని గోపాలపురం, వేళ్లచింతలగూడెం, చిట్యాల, వెంకటాయపాలెం, గంగోలు, దొండపూడి, వాదాలకుంట, జగన్నాథపురం గ్రామాలలో కోడి పందేలు విచ్చలవిడిగా జరిగాయి.



గోపాలపురంలో నిర్వహిస్తున్న కోడి పందేలు

రెండో పంటకు నీరందించండి



సింగరాజుపాలెంలో పోలవరం కుడి కాలువలో రైతుల నిరసన

నల్లజర్ల: పట్టిసీమ లిఫ్ట్ ద్వారా రెండో పంటకు నీరందించి ఆదుకోవాలని సింగరాజుపాలెం రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. పోలవరం కుడి కాలువ నిర్మాణానికి ఎంతో విలువైన తమ భూములను త్యాగం చేసి తక్కువ ధరకే ప్రభుత్వానికి అందించి సహకరించామని రైతులు వామిశెట్టి పరమేశ్వరావు, బుద్దాల వెంకటేశ్వరావు తదితరులు అధికారులకు వివరించారు. ప్రతి ఏడాది రెండో పంటగా మొక్కజొన్న వేసి పోలవరం కాలువలో ఉన్న జలాలను మోటార్ల ద్వారా తీసుకొని పంటను గట్టెక్కించుకునే వారమని, ఈ ఏడాది గొల్లగూడెం లిఫ్ట్ ద్వారా ఉన్న జలాలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరావు తమ ప్రాంతానికి తరలించుకు పోయారని అన్నారు. దీంతో నల్లజర్ల మండలంలో అచ్చన్నపాలెం, ఆవపాడు, సింగరాజుపాలెం, మార్లెళ్లమూడి, గొల్లగూడెం గ్రామాల్లో రైతులకు రెండో పంట మొక్కజొన్నకు నీరందకుండా పోయిందని రైతులు బుధవారం వివరించారు. పట్టిసీమ లిఫ్ట్ ద్వారా మార్చి వరకు నీరందిస్తే పంట గట్టెక్కుతుందని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు తమ ఇబ్బందులు తెలియజేసినట్టు సింగరాజుపాలెం ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి, రైతులు వివరించారు. ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి మొక్కజొన్న పంటకు నీరందించే ఏర్పాటు చేయాలని రైతులు ఎండిపోయిన పోలవరం కుడి కాలువలో దిగి నిరసన వ్యక్తం చేశారు.

యథేచ్ఛగా కోడి పందేల నిర్వహణ



కొవ్వూరు మండలం పశివేదలలో కోడి పందేల శిబిరం వద్ద పందెం రాయుళ్ల సందడి



కొవ్వూరు మండలం కుమారదేవంలో గుండాట ఆడుతున్న జూదరులు

- చేతులు మారిన రూ.3 కోట్లకు పైగా సొమ్ము
- జూద క్రీడలతో కోలాహలంగా మారిన పరిసరాలు
- తిరునాళ్లను తలపించిన పందెం శిబిరాలు

కొవ్వూరు: సంక్రాంతి పండగ సంప్రదాయం ముసుగులో మూడు రోజుల పాటు జూద క్రీడలు అడ్డూ అదుపు లేకుండా నడిచాయి. సంప్రదాయ కోడి పందేల పేరుతో పేకాట, గుండాట, కోతాట, ముక్కలాట వంటి జూద క్రీడలు జోరుగా నిర్వహించారు. నియోజక వర్గ వ్యాప్తంగా ఇరవై చోట్ల కోడి పందేల శిబిరాలు వెలశాయి. ఈ శిబిరాల్లో సరాసరి రోజుకు రూ.కోటి చొప్పున మూడు రోజుల్లో సుమారు రూ.3 కోట్ల మేర సొమ్ము చేతులు మారింది. తాళ్లపూడి మండలంలో ఎనిమిది, చాగల్లు మండలంలో ఆరు, కొవ్వూరు మండలంలో ఆరు చొప్పున శిబిరాలు ఏర్పాటు చేశారు. గజ్జరం, వేగేశ్వరపురం, ఐ.పంగిడి గ్రామాల్లో రెండేసి, తాళ్లపూడి, రావూరుపాడు, మలకపల్లి, పెద్దేవం, పశివేదల, సీతంపేట, కుమారదేవం, కొవ్వూరు, చిక్కాల, ఉనగట్ల, బ్రాహ్మణగూడెం, మీనా నగరం, మల్లవరం, కలవలపల్లి తదితర గ్రామాల్లో ఒక్కో శిబిరం చొప్పున ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. కొవ్వూరు పట్టణంలో కోడి పందేల శిబిరం తిరునాళ్లను మరిపించే విధంగా నిర్వహించారు. పట్టణ సమీపంలో ఒకే శిబిరం ఏర్పాటు చేయడంతో పందెం రాయుళ్లు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

630 పందేలు.. రూ.3.50 కోట్లు

పెరవలి: సంక్రాంతి సందర్భంగా జరిగిన కోడి పందేలు, గుండాట్లతో రూ.3.50 కోట్లు చేతులు మారాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. వీక్షకుల కోసం కోడిపందేలు జరిగే చోటే టెంట్లు ఏర్పాటు చేసి అన్ని రకాల విందు లభించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అధికారికంగా కోడిపందేలు నిర్వహించకూడదనే నిబంధనలు ఉన్నా వాటిని కాగితాలకే పరిమితం చేసి పోలీసు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌ల అధికారులు జేబులు నింపుకున్నారని ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. మంగళ, బుధవారాల్లో జరిగిన పోటీల్లో హైదరాబాద్, నల్గొండ, చిత్తూరు, కడప, కృష్ణ, గుంటూరు, తూర్పు, విశాఖ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో జూదరులు వచ్చి పందేల్లో పాల్గొన్నారు. బుధ, గురువారం జరిగిన పోటీల్లో 3 కోట్లకు పైగా చేతులు మారాయని జూదరులు చెపుతున్నారు. పెరవలి మండలంలో ఖండవల్లి, పెరవలి, ముక్కామల, అజ్జరం, మల్లేశ్వరం, పిట్టల వేమవరం గ్రామాల్లో మూడు రోజుల్లో 630 పందేలు జరిగాయి. గుండాటల వద్ద లక్షలాది రూపాయలు చేతులు మారాయి. గత రెండు రోజులుగా జరిగిన పోటీలలో రూ.3 కోట్లు చేతులు మారాయని బహిరంగంగా చెప్పుకుంటున్నారు.



ఖండవల్లిలో తలపడుతున్న పందెం కోళ్లు

కోడి పందేలు నిర్వహిస్తున్న బరుల వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి దుకాణా దారులు నిర్వాహకులకు లక్షల్లో సొమ్ములు ముట్టచెప్పినట్లు సమాచారం. కోడిపందేలు పుణ్యామా అని పోలీసులకు భారీగా ముడుపులు అందినట్లు చెప్పుకుంటున్నారు. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా ఒక్కొక్క బరికి రూ.2.50 నుంచి రూ.3 లక్షల వరకు ముడుపులు ఇచ్చినట్లు బహిరంగంగా నిర్వహకులు చెబుతున్నారు. అన్నవరప్పాడులో నిర్వహించిన భారీ పేకాట, కోతాట శిబిరంలో ఈ మూడు రోజుల్లో రూ.2 కోట్లు చేతులు మారాయని భోగట్టా.

కోసకు యమ డిమాండ్

నిడదవోలు: సంక్రాంతి సీజన్‌లో కోసకు యమ డిమాండ్ ఏర్పడుతోంది. కోడిపందేల్లో ఓడిపోయిన కోడిని కోజ అంటారు. సంక్రాంతి సీజన్‌కు ముందు పందెం కోడి పుంజులకు మూడు నెలల పాటు ఎన్నో పోషక విలువలున్న ఆహారం పెట్టి దట్టంగా మేపుతారు. ఒక్కో పుంజు 3 కేజీల నుండి 8 కేజీల వరకూ బరువుతో తయారయ్యాక వాటిని పందెంరాయుళ్లు బరుల్లో దింపుతారు. పందేల్లో ప్రధానంగా కాకి, డేగ, నెమలి, పరదా, పచ్చ కాకి, పిట్టమారు, రసంగి, తీతువా మైయిలా, సింగాలి వంటి రకాల పుంజులను బరిలో దింపుతూంటారు. రంగు రకాన్ని బట్టి ఒక్కో పుంజును రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ కొంటారు. ఎక్కువగా పచ్చకాకి, డేగ వంటి రకం పుంజుల కాళ్లకు కత్తులు కట్టి బరిలోకి దింపుతారు. వీటిల్లో ఓడిన కోడిని గెలిచిన కోడికి సంబంధించిన పందెంరాయుడు తీసుకుపోతాడు. ఇవి బలవర్ధకమైనవనే ఉద్దేశంతో పలువురు ఈ కోజ మాంసం కోసం ఎగబడుతూంటారు. ఇదే అదనుగా 5 కేజీల కోజను రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకూ విక్రయించారు. కొనుగోలుదార్లు కూడా తగ్గేదేలే.. అన్నట్టుగా ఎంత రేటయినా కోసను కొనేందుకు ఎగబడ్డారు. సంక్రాంతికి ఇంటికి వచ్చిన బంధుమిత్రులకు కోస మాంసంతో పసందైన విందు ఇచ్చారు. సంక్రాంతికి కోస తినకపోతే అవమానంగా భావించే వారు కూడా ఉన్నారు. పందెం బరులు ఏర్పాటు చేసిన నిర్వాహకులు మాత్రం రాజకీయ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ఉన్నతాధికారులకు 5 నుంచి 7 కేజీల బరువున్న కోజాలను పంపించి వారిని ప్రసన్నం చేసుకుంటున్నారు.

మూడో రోజు జోరుగా కోడి పందేలు

- విచ్చలవిడిగా పందేలు
- నేతల అండదండలు

నిడదవోలు : నియోజకవర్గంలో సంక్రాంతి పండగ ముసుగులో ఏటా నిర్వహించే కోడి పందేలు బుధవారంతో మూడు రోజుల పాటు జోరుగా సాగాయి. నియోజకవర్గంలో మూడు రోజుల పాటు వేసిన బరుల్లో సుమారు రూ. 3 కోట్ల మేర నగదు చేతులు మారినట్లు అంచనా. కూటమి నాయకులు అండతో కోడి పందేల రాయుళ్లు బరి తెగించారు. పోలీసులు అనధికార అనుమతులు ఇవ్వడంతో పందెం రాయుళ్లు బరితెగించి రక్తపు టేరులు పారించారు. మోజుతో పెంచుకున్న కోళ్లను బరిలో దించి తమ సత్తా చాటుకున్నారు. నిడదవోలు పట్టణ పరిధిలో సింగవరం-సుబ్బరాజుపేట సమీపంలో వేసిన పెద్ద బరిలో భారీగా పందేలు సాగాయి. వివిధ జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ నుంచి పందెం రాయుళ్లు హాజరయ్యారు. ఒక్కో పందేనికి లక్షలాది రూపాయలు చేతులు మారాయి. వీక్షకుల కోసం ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి పందేలను ప్రత్యక్ష ప్రచారం చేశారు. పట్టణంలోని యర్నగూడెం రోడ్డులో వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో లేఅవుట్, బసివిరెడ్డిపేటలో వేసిన బరుల్లో పందేలు జోరుగా సాగాయి.

నిడదవోలు రూరల్: పల్లెల్లో ఎక్కడ చూసినా కోడి పందేలు, గుండాటలు యథేచ్ఛగా మంగళ, బుధవారాల్లో జరిగాయి. నిడదవోలు మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం, సింగవరం, డి.ముప్పవరం, విజ్జేశ్వరం గ్రామాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. బరులు వద్ద గుండాటతో పాటు నిర్వాహకులు బిర్యానీ సెంటర్లు, చికెన్ పకోడి స్టాళ్లను ఏర్పాటు చేశారు. పందేలకు వచ్చిన వారితో ఆయా గ్రామాలు సందడిగా మారాయి.

తాళ్లపూడి: మండలంలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు బుధవారం మూడో రోజూ నిర్వహించారు. మండలంలోని తాళ్లపూడి, పెద్దేవం, గజ్జరం, వేగేశ్వరపురం, రావూరుపాడు, అన్నదేవరపేట, మలకపల్లి తదితర గ్రామాల్లో 8 చోట్ల టీడీపీ, జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కోడి పందేలు నిర్వహించారు. మద్యం దుకాణాల ఏర్పాటుతో మందు బాబులు విందు చేసుకున్నారు. ఒక్కో పందేం రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు జరిగింది. మండలంలో సుమారు రూ. రెండు కోట్లకు పైగా నగదు చేతులు మారినట్టు అంచనా. గజ్జరం బరి వద్ద ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.



సింగవరం-సుబ్బరాజుపేటలో ఎల్‌ఈడీ తెరపై పందేల ప్రత్యక్ష ప్రసారం

వైభవంగా నంగాలమ్మ గరగోత్సవం

నిడదవోలు : సంక్రాంతి సందర్భంగా పట్టణంలో శ్రీ నంగాలమ్మ అమ్మవారి పూరిగుడి వద్ద మంగళవారం రాత్రి అమ్మవారి గరగోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గుడ్ల వంశీయుల ఆధ్వర్యంలో నంగాలమ్మ తల్లి గరగలను ఎత్తుకుని భక్తులు పట్టణంలో ప్రధాన సెంటర్ల గుండా ఊరేగారు. రాయాలయం వీధిలో కౌన్సిలర్ ముంగండి మాణిక్యమాల ఆధ్వర్యంలో అమ్మవారికి పాన్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి గరగలు తిప్పతున్న భక్తులు

సంక్రాంతి వేడుకల్లో ఆర్డీవో సుస్మిత



చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు: వాడపల్లిలో నివాసం ఉంటున్న 14 చెంచు కుటుంబాలతో కలిసి ఆర్డీవో రాణి సుస్మిత సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు మిఠాయిలు పంచారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు), సర్పంచ్ గెల్లా ప్రసాద్, తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బీహెచ్ ప్రకాశరరావు, ఆర్ఐ బి.విశ్వేశ్వరరావు, వీఆర్వో కె.ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా



హైవేపై బోల్తా పడిన కారు

దేవరపల్లి: గుండుగొలను – కొవ్వూరు మధ్య జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం బందపురం వద్ద బుధవారం కారు బోల్తా పడింది. రాజమహేంద్రవరం నుంచి ఏలూరు వైపు వెళుతున్న కారు బందపురం వద్ద అదుపు తప్పి డ్రైన్‌లోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని వ్యక్తులు సురక్షితంగా బయటపడినట్టు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదూ అందలేదని పోలీసులు తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



1996వ బ్యాచ్ విద్యార్థులు

పెరవలి: ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ ఒక సినీ కవి పాట రచిస్తే అందుకు తగినట్లుగా 1996 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు అంతా ఓ చోటకు చేరి గురువారం సందడి చేశారు. ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులలో ఒకరైన గ్రామ సర్పంచ్ భావన పూర్ణచందు, కంతేటి సీతారామరాజు, సత్యవాణి, అప్పారావు, దేవయ్య, వరప్రసాద్‌లు నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com